సాక్షి ఒడిశా

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,00,222లు, బంగారం 150 మిల్లీగ్రాములు, వెండి 27 గ్రాముల 4 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వ్యక్తిపై మారణాయుధాలతో దాడి

పాత కక్షలతో ఒక వ్యక్తిపై గుర్తు తెలియని దుండగులు మారణాయుధాలతో దాడి చేసిన ఘటన స్థానిక రెల్లివీధి కూడలి వద్ద మంగళవారం చోటు చేసుకుంది.

- 8లో



ఏనుగుల గుంపు సంచారం

నవరంగ్‌పూర్‌లో జిల్లాలోకి అటవీ ఏనుగుల గుంపు ప్రవేశించింది.

- 8లో

న్యూస్‌రీల్

ఎరువుల గోదాములపై ఆకస్మిక దాడులు



తనిఖీలు చేపడుతున్న అధికారులు

రాయగడ: బిసంకటక్‌లోని నాలుగు ఎరువుల గోదాముల్లో అధికారులు ఆకస్మిక దాడులను నిర్వహించారు. ప్రభుత్వ నిర్ధారిత ధర కన్నా అధికంగా వ్యాపారులు విక్రయిస్తూ రైతులను మోసగిస్తున్నారనే ఆరోపణల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో భాగంగా ముగ్గురు గోదాముల నిర్వాహకులకు నోటీసులను జారీ చేశారు. బిసంకటక్ తహసీల్దార్ కె.వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో బిసంకటక్ సమితి వ్యవసాయ శాఖ అధికారి ఘనస్యామ్ హుయిక, పోలీసులతో ఏర్పాటైన ప్రత్యేక స్క్వాడ్ ఈ మేరకు సోమవారం దాడులను చేపట్టింది. గోదాముల్లో నిల్వ ఉంచిన ఎరువుల వివరాలను సేకరించిన అధికారులు అందుకు సంబంధించిన అనుమతి పత్రాలను తనిఖీ చేశారు.

సూర్య నారాయణ త్రిపాఠి మృతి



సూర్య నారాయణ త్రిపాఠీ(ఫైల్)

కొరాపుట్: ప్రతిపక్ష బిజూ జనతా దళ్ వ్యవస్థాపక సభ్యుడు, పార్టీ సీనియర్ నాయకుడు సూర్య నారాయణ త్రిపాఠి(72) మృతి చెందారు. మంగళవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. అనంతరం మృతదేహాన్ని స్వస్థలం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. పాతికేళ్ల క్రితం జనతా దళ్ నుంచి విడిపోయి బిజూ జనతా దళ్ పార్టీ ఆవిర్భవించింది. దీంతో ఆరోజుల్లో నబరంగ్‌పూర్ జిల్లాలో పార్టీ అభివృద్ధికి సూర్య నారాయణ ఎంతోకృషి చేశారు. న్యాయవాదిగా ప్రజా సమస్యలపై లేఖాస్త్రాలతో పోరాటంలో చేయడంలో పేరు సంపాదించారు. మృతదేహానికి బీజేడీ రాజ్యసభ ఎంపీ మున్నా ఖాన్, మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు జిదేశ్వర్ ఖడంగా, ప్రకాష్ మిశ్ర తదితరులు నివాళులర్పించారు.

సెంచూరియన్‌లో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా

పర్లాకిమిడి: పట్టణానికి సమీపంలోని ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సును ఎస్పీ జ్యోతింద్ర పండా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాస్వామ్య మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తపస్తా ప్రహరాజ్ మాట్లాడుతూ.. సున్నితమైన యువత మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడకుండా పెద్దలు, విద్యాసంస్థలు, అధికారులు మద్దతు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన మహిళా దొంగలు



స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

భువనేశ్వర్: రైలులో ప్రయాణికుల నుంచి నగలు, నగదు దోచుకున్న మహిళా దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. బీహార్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఈ దొంగతనానికి పాల్పడ్డారు. జార్ఖండ్ నుంచి పూరీకి ప్రయాణిస్తున్న ఒక కుటుంబం నుంచి రూ.17,000ల నగదుతో పాటు 2 మంగళ సూత్రాలు, 3 లాకెట్లను దొంగిలించారు. రైలులో గందరగోళం సృష్టించి వ్యానిటీ బ్యాగ్‌లో దాచుకున్న ఈ సొత్తుని దొంగిలించినట్లు గుర్తించి రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) వర్గాలకు సమాచారం అందజేశారు. ప్రభుత్వ రైల్వే పోలీసులతో (జీఆర్‌పీ) కలిసి వీరు రంగంలోకి దిగి సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గాలించి అదుపులోకి తీసుకుని విచారణ జరిపిన మేరకు అరెస్టు చేశారు. వారి నుంచి దొంగిలించిన నగదు, ఆభరణాలు స్వాధీనపరచుకుని బాధిత వర్గానికి అందజేశారు.

- ఆందోళనలకు సిద్ధమవుతున్న బీజేడీ
- బీజేపీ ప్రభుత్వంపై పక్షపాత ఆరోపణలు
- గత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాంతాలను సైతం చేర్చాలని డిమాండ్



ఎన్‌ఏసీలపై... రాజకీయ రగడ..!

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్త నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్స్‌ను(ఎన్‌ఏసీలు) ప్రకటించడంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని విపక్షం బిజూ జనతా దళ్ ఆరోపిస్తోంది. ప్రభుత్వ వైఖరి మారకుంటే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసన ప్రదర్శనలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తోంది. రాష్ట్రంలో కొత్త ఎన్‌ఏసీలు ఏర్పాటు కోసం గత ప్రభుత్వం ఆమోదిత ప్రాంతాల జాబితాను జారీ చేసింది. ఇంతలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో గత ప్రభుత్వం ఖరారు చేసిన ప్రాంతాలను కొత్త ఎన్‌ఏసీ ప్రాంతాల జాబితాలో చోటు కలిపించనట్లు గుర్తించారు. దీంతో లోగడ ప్రకటించిన ఎన్‌ఏసీలను అమలు చేయకపోతే బీజేడీ ఆందోళనలు చేస్తుందని ప్రకటించారు.

కొత్తగా 16 ఎన్‌ఏసీలు ప్రకటన

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 16 కొత్త ఎన్‌ఏసీలు మరియు 7 మున్సిపాలిటీలను ప్రకటించింది. తాజాగా ప్రకటించిన 7 మున్సిపాలిటీల జాబితాలో గతేడాది నవీన్ పట్నాయక్ సర్కారు ప్రకటించిన 4 మున్సిపాలిటీ ప్రాంతాలు బౌధ్, కరంజియా, అస్కా మరియు ఛత్రపురం చోటు చేసుకున్నాయి. అయితే గత ప్రభుత్వం ప్రతిపాదిత ఎన్‌ఏసీ ప్రాంతాలను ఎన్‌ఏసీల ప్రకటన జాబితాలో మినహాయించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఫలితంగా రాష్ట్రంలో రాజకీయ వివాదం నెలకొంది. గత ప్రభుత్వం 57 ప్రాంతాలకు ఎన్‌ఏసీ హోదాకు ఖరారు చేసినట్లు ప్రకటించింది. వాటిలో 39 ప్రాంతాలను ఈ హోదా నుంచి మినహాయించి కొత్త ప్రభుత్వం తాజా జాబితా వెల్లడించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

ఆందోళన అనివార్యం

రాష్ట్రంలో వేగవంతమైన పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కోవడానికి గత ప్రభుత్వం 57 ప్రాంతాలకు ఎన్‌ఏసీ హోదా కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు తదుపరి కార్యాచరణ కోసం ఆయా ప్రాంతాల జిల్లా కలెక్టర్లకు సిఫారసు చేసింది. తదనంతరం కొత్త పట్టణ ప్రాంతాల ఏర్పాటు కోసం ప్రభుత్వ గెజిట్ జారీ కావాల్సింది. అయితే ఇంతలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అంతా తారుమారు చేసి గందరగోళం నెలకొందని బిజూ జనతా దళ్ ఉపాధ్యక్షుడు దేబీ ప్రసాద్ మిశ్రా విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు గడిచినా కొత్త ఎన్‌ఏసీల ఏర్పాటుకు సంబంధించి అధికారిక చర్యలు చేపట్టకుండా నాన్చుడు ధోరణి ప్రదర్శించి, పలు ప్రతిపాదిత ప్రాంతాలను ఎన్‌ఏసీ హోదా నుంచి మినహాయించి తాజా జాబితాని జారీ చేసిందని వ్యాఖ్యానించారు. 57 ప్రతిపాదిత ఎన్‌ఏసీ ప్రాంతాల జాబితాలో నామమాత్రంగా 18 ప్రాంతాలకు కొత్త ప్రభుత్వం ఆమోదించి మిగిలిన ప్రాంతాల్ని మినహాయించిందని పేర్కొన్నారు. మిగిలిన 39 ప్రతిపాదిత ప్రాంతాలను ఈ జాబితా నుంచి మినహాయించారు. ఈ చర్య కొత్త ప్రభుత్వం పక్షపాత వైఖరికి అద్దం పడుతుందన్నారు. తక్షణమే మినహాయించిన ప్రతిపాదిత ఎన్‌ఏసీ ప్రాంతాలతో అదనపు జాబితాని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించకుంటే ప్రజల ప్రయోజనాల పరిరక్షణ దృష్ట్యా బిజూ జనతా దళ్ ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం హింజిలికాటు నియోజకవర్గంలో సెరాగొడా మరియు బింఝార్‌పూర్ ప్రాంతాలకు ఎన్‌ఏసీగా ఎదుగుదల కల్పించినట్లు ప్రకటించింది. ఈ 2 ప్రాంతాలు తాజా జాబితాలో స్థానం సాధించలేకపోయాయి. బింఝార్‌పూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బిజూ జనతా దళ్ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ ఈ చర్యపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదులను అధికారికంగా నమోదు చేశారు.

కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీ

- ఏఐసీసీ పరిశీలకుడు జెట్టి కుసుంకుమార్



మీడియాతో మాట్లాడుతున్న జెట్టి కుసుం కుమార్ తదితరులు

కొరాపుట్: దేశానికి కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీ అని ఏఐసీసీ పరిశీలకుడు జెట్టి కుసుం కుమార్ జోస్యం చెప్పారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ప్రసంగించారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతం చేసే కార్యక్రమం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒడిశాలో డీసీసీ అధ్యక్ష పదవి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని తెలియజేశారు. సమితి స్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 10 సమితులు, రెండు పురపాలక సంఘాల్లో సమీక్ష సమావేశాలు జరుపుతామన్నారు. అధ్యక్ష పదవి కోసం అందరికీ దరఖాస్తులు ఇస్తామని వెల్లడించారు. నెలాఖరులోపు డీసీసీ అధ్యక్ష ఫలితాలు వెల్లడవుతాయన్నారు. అనంతరం సమితి అధ్యక్ష, మిగతా కార్యవర్గాలను నియమించనున్నట్లు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ముందుంటుంది

దేశ ప్రజలకు మేలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని కుసుం కుమార్ అన్నారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా ప్రజల కోసమే పని చేస్తుందన్నారు. ప్రస్తుతం ఓట్ చోరీపై పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. రాహుల్ చేసిన భారత్ జోడో యాత్రతో ప్రజలు వాస్తవాలు గ్రహించారన్నారు. నాడు కొరాపుట్, నబరంగ్‌పూర్ పార్లమెంటరీ స్థానాలు కాంగ్రెస్‌కి కంచుకోటలని గుర్తు చేశారు. మరలా నబరంగ్‌పూర్‌లో పార్టీ పటిష్టతకి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు భుజబల్ మజ్జి, సదానా నాయక్, డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, కాంగ్రెస్ నాయకులు జి.సాయిరాజు, నాగరత్నం, శివరామరాజు, దిలిప్ బెహరా, కెమరాజ్ బాగ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి ఒకరు మృతి



గుప్త నాయిక్(ఫైల్)

జయపురం: ఒక వ్యక్తి దహన సంస్కారాలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి దశమంతపూర్ పంచాయతీ పంద్రిపొడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మరణించడంతో గ్రామస్తులు శ్మశానవాటికకు తీసుకెళ్లారు. వారితో పాటు గుప్త నాయిక్(35) కూడా వెళ్లాడు. దహన సంస్కారాలు అనంతరం గుప్త నాయిక్ ఇంటికి బయల్దేరాడు. అయితే అతడు సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. కొడుకు ఇంటికి రాకపోవడంతో అతడి తల్లి పరిసర ప్రాంతాల్లో వెదికింది. గ్రామ సమీపంలోని ఒక చెరువు వద్ద తన కుమారుడి చెప్పులు కనిపించాయి. అనుమానంతో ఆమె గ్రామ ప్రజలకు తెలిపింది. గ్రామ ప్రజలు చెరువులో ఎంత గాలించినా జాడ తెలియలేదు. దీంతో బొయిపరిగుడ అగ్నిమాపక విభాగానికి తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది చెరువులో మృతదేహాన్ని బయటకు తీశారు. బొయిపరిగుడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గుప్త నాయిక్ చెరువులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మరణించి ఉంటాడనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఘాట్ రోడ్డులో భారీ వాహనం బోల్తా




ఘాటీ మలుపులో బోల్తాపడిన వాహనం




రోడ్డు పొడవున నిలిచిపోయిన వాహనాలు

రాయగడ: సదరు సమితికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమ్మ ఘాటి మలుపులో మంగళవారం వేకువజామున కొరాపుట్ నుంచి వస్తున్న ఒక భారీ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న కుంభికోట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో రాయగడ నుంచి కొరాపుట్ అటు కాసీపూర్, టికిరి ప్రాంతాలకు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. రాయగడ మీదుగా కొరాపుట్, నారాయణపట్నం వెళ్లే బస్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ఫలితంగా ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరణ చేపట్టారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రదీకరణ కార్యదర్శి సుజాత



శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులు

జయపురం: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రదీకరణ జయపురం అధ్యక్షులు ప్రదీప్ కుమార్ మహంతి అన్నారు. స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సచేతన ప్రదీకరణ జిల్లా కార్యదర్శి ప్రద్యోమయ సుజాత మాట్లాడుతూ.. మహిళలపై దాడులను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. యాసిడ్ దాడి బాధితులకు ఉచిత వైద్యం, రూ.3 లక్షల నష్ట పరిహారంతో పాటు కేసు దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వీసీఎస్ ఏర్పాటు చేశాయని వివరించారు. శిబిరంలో విజిలెన్స్ కోర్టు స్పెషల్ పీపీ డాక్టర్ బి.గాయత్రీదేవి, కొరాపుట్ జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ సుసంధ్య దేవదర్శిణి, మున్సిపల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ప్రియదర్శిణి పొరిడ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేసినవారికే పగ్గాలు

- ఏఐసీసీ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రిజ్వాన్, చిన్మయ, అఖిల్ బొత్ర, అప్పలస్వామి తదితరులు



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

రాయగడ: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన వారికే డీసీసీ పగ్గాలు అప్పగించేందుకు అధిష్టానం యోచిస్తోందని బెంగుళూర్ శివాజీనగర్ ఎమ్మెల్యే, ఏఐసీసీ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్ స్పష్టం చేశారు. రాయగడలో మంగళవారం పర్యటించిన ఆయన ఈ మేరకు స్థానిక మున్సిపాలిటీ టౌన్ హాల్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచే రాయగడ వంటి జిల్లాలో పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే నాయకుడికే డీసీసీ పగ్గాలను అధిష్టానం ఇస్తుందన్నారు. ఈ మేరకు అధిష్టానం ఆదేశాల మేరకు ఈ జిల్లాలో తాను ఆరు రోజుల పాటుగా పర్యటించి కార్యకర్తలతో సమావేశమై తుది నివేదికను అధిష్టానానికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా పార్టీని పటిష్టపరచాలనే ఉద్దేశంతో అధిష్టానం తనను జిల్లాలో పర్యటించేందుకు ఆదేశించిందని వివరించారు. జిల్లాలోని 11 సమితుల్లో పర్యటించి కార్యకర్తల మనోభావాలను తెలుసుకుంటానన్నారు.

సత్తా చాటుతాం

ఒడిశా రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని అర్షద్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. ప్రతీ జిల్లాలో పార్టీ పటిష్టతకు వ్యూహాత్మకంగా పార్టీ ముందుకెళ్తుందని పేర్కొన్నారు. గడిచిన రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేడీతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రస్తుతం అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం తీరు కూడా అలాగే ఉందని ఎద్దేవా చేశారు. ఆయనతో పాటు పీసీసీ పరిశీలకులు చిన్మయ్ సుందర్ దాస్, అఖిల్ భొత్ర తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయండి

కాంగ్రెస్ పార్టీ విజయానికి అందరూ సమష్టిగా పని చేయాలని కార్యకర్తలకు రిజ్వాన్ పిలుపునిచ్చారు. అంతకుముందు జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. గత సాధారణ ఎన్నికల్లో రాయగడ జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానం కూడా కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయడం శుభసూచికమని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ తాత్కాలిక అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండ, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో తదితరులు పాల్గొన్నారు.

పులి చర్మాలు అక్రమ రవాణా



అరెస్టైన నిందితులను చూపిస్తున్న అధికారులు

- ఇద్దరు నిందితులు అరెస్టు



స్వాధీనం చేసుకున్న వేటాడడానికి ఉపయోగించే సామగ్రి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా అటవీ డివిజన్ నుంచి అక్రమంగా పులి చర్మాలు, గోళ్లు ఇతర జిల్లాలకు రవాణా చేస్తున్న చిత్రా మల్లిక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి కె.నాగరాజు తెలియజేశారు. గంజాం జిల్లా ఘుమసుర అటవీ డివిజన్ పరిధిలో రెండు రోజుల క్రితం పులిచర్మాలు అక్రమంగా రవాణా, అమ్ముతున్న ఒక ముఠా నిందితుడిని నార్త్ ఫారెస్టు డివిజన్ (గంజాం) అధికారులు అదుపులోకి తీసుకొని ఈ సమాచారం రాబట్టారు. వెంటనే ఏసీఎఫ్ సైనీశ్రీ దాస్ ఆధ్వర్యంలో చంద్రగిరి అటవీ రేంజ్ అధికారులు, ఘుమసుర అటవీ డివిజన్ సిబ్బందితో ఒక ప్రత్యేక జాయింట్ బృందం మోహనాలో చిత్రామల్లిక్ ఇంట్లో సోదాలు జరిపింది. దీంట్లో భాగంగా చిత్రా మల్లిక్ ఇంట్లో నాలుగు చిరుత పులుల చర్మాలు, వాటి దంతాలు, గోళ్లు, బాణాలు, సింగిల్ షాట్స్ గన్, వివిధ రకాల జంతువుల ట్రాప్స్, సెల్‌ఫోన్, రక్తంతో కూడిన గోడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌వో నాగరాజు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి చిత్రామల్లిక్, సహచరుడు లుల్లూ మల్లిక్‌ను అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు.

దోపిడీ కేసులో ఏడుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అమూల్య కుమార్ పక్కనే ఐఐసీ బెహర తదితరులు



స్వాధీనం చేసుకున్న బొలేరో వాహనం

రాయగడ: సదరు పోలీస్‌స్టేషన్ పరిధి రఫ్‌కొన కూడలిలో సోమవారం జరిగిన దోపిడీ కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.2.83 లక్షల నగదుతో పాటు దోపిడీకి వినియోగించే బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం సదరు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏఎస్పీ అమూల్య కుమార్ దళ్, ఐఐసీ ప్రసన్న కుమార్ బెహరలు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఇదీ విషయం..

గజపతి జిల్లా గారబంద పోలీస్‌స్టేషన్ పరిధి లాబయగడ గ్రామానికి చెందిన టి.ఉమారెడ్డి అనే వ్యక్తి తన ఇద్దరు మిత్రులతో కలిసి కారులో జయపురం నుంచి రాయగడకు రూ.9 లక్షల నగదుతో సోమవారం వస్తున్నాడు. ఆ సమయంలో రఫ్‌కొన కూడలిలో సునితా నాయక్ అనే మహిళ హోంగార్డు దుస్తుల్లో కారు ఎదురుగా నిలబడి ఆపింది. కారులో ప్రయాణిస్తున్న వారితో మాట్లాడుతున్న సమయంలో ఒక బొలేరోలో మరో ఏడుగురు వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. వారిలో నలుగురు హోంగార్డు దుస్తులతో ఉన్నారు.

వీరంతా బాధితుడు ఉమారెడ్డిని బెదిరించి ఇంత మొత్తం నగదు ఎక్కడికి తీసుకెళ్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఎస్పీ కార్యాలయానికి రమ్మని చెప్పి తమ వెంట తీసుకొచ్చిన బొలేరోలో ఉమారెడ్డిని కొంతదూరం వరకు తీసుకెళ్లారు. అనంతరం ఒక ప్రాంతంలో సునీత అనే మహిళను దింపేసి, తర్వాత ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అతడిని బెదిరించి, రూ.9 లక్షల నగదుతో పాటు 40 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కొని అక్కడే ఉమారెడ్డిని విడిచిపెట్టి పరారయ్యారు. దీంతో బాధితుడు సదరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో జిల్లాలోని బిసంకటక్ బడసాహికి చెందిన హోంగార్డు ఇంద్రమణి కరకరియా, కల్యాణ సింగుపూర్ పల్లిగాం గ్రామానికి చెందిన హోంగార్డు దిలిప్ గరడియా, బడ గ్రామానికి చెందిన తమన ప్రస్కా, హిరా నాయక్ గరాడియా, టికిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తోటాగుడ గ్రామానికి చెందిన సింహాచల్ మాఝి, రాధిక హల్వ అలియాస్ సునితా హల్వ, ముకేష్ నాగ్‌లు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


మృతిచెందిన రెయ్యమ్మ

టెక్కలి రూరల్: సంత బొమ్మాళి మండలం వడ్డివాడ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మురపాల రెయ్యమ్మ(45) అనే మహిళ మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగి రామారావు, మురపాల రెయ్యమ్మలు కలసి ద్విచక్ర వాహనంపై బోరుభద్ర నుంచి సంతబొమ్మాళి వైపు వెళ్తుండగా అదే సమయంలో ముందు వెలుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రెయ్యమ్మ, రామారావులతో పాటు మరో బైకుపై ఉన్న నెయ్యల రామకృష్ణకు సైతం గాయాలయ్యాయి. ముగ్గురినీ కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రెయ్యమ్మ మృతిచెందింది. సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నేరస్తులపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి నేరస్థులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన, పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసుల దర్యాప్తు వేగవంతం చే యాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డివిజన్లు, సర్కిళ్లు, స్టేషన్ల వారీగా అధికారులతో సమీక్షించారు. గంజాయి కేసుల దర్యాప్తు, నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలు, పెండింగ్ కారణాలపై ఆరా తీశారు. ఎస్పీతోపాటు డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గోవిందరావు పాల్గొన్నారు.

హోంగార్డు కుమారుడికి అభినందనలు..
పాతపట్నం సర్కిల్ కార్యాలయంలో హోంగార్డు చక్క వాసుదేవరావు కుమారుడు శేఖర్ నాయుడు నీట్ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్ సీటు పొందడంతో ఎస్పీ అభినందించారు.

అధికార లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: అనారోగ్యంతో మృతి చెందిన పోలాకి ఏఎస్ఐ పి.ఆదినారాయణకు మంగళవారం నరసన్నపేటలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పోలాకి ఎస్ఐ రంజిత్ తెలిపారు. నరసన్నపేట, పోలాకి పోలీసుస్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం తిలారు-కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు పైబడి ఉంటుందని, చేతిపై శ్రీను అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. రైలు నుంచి జారి పడి మృతిచెందాడా.. మరేదైనా కారణం ఉందా అనేది తెలియడం లేదు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావు పేర్కొన్నారు.

అండర్-23 క్రికెట్ జట్టులో హరీష్

హిరమండలం: అండర్-23 విభాగంలో ఓ సంస్థ నిర్వహించే టీ-20 క్రికెట్ మ్యాచ్‌లు ఆడేందుకు టీమిండియాలో గొట్టా గ్రామానికి చెందిన బత్తుల హరీష్ చోటు సంపాదించాడు. నేపాల్‌లో డిసెంబర్ నుంచి జరగనున్న అంతర్జాతీయ టోర్నీలో హరీష్ దేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. దీంతో హరీష్‌ను గ్రామపెద్దలతో పాటు గ్రామస్తులు అభినందించారు.

గొంతు కోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పలాస: పలాస కాశీ బుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకు చెందిన కోరాడ గవరయ్య (35) మంగళవారం ఉదయం పదునైన చాకుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు కుటుంబ కలహాలే కారణమని తెలుస్తోంది.

లక్ష్మమ్మకు సత్కారం

వజ్రపుకొత్తూరు: సుమారు 50 ఏళ్లగా ఎంతోమందికి పురుడు పోసిన అంబటి లక్ష్మమ్మ సేవలు వెలకట్టలేనివని విశ్రాంత ఆర్మీ అధికారి కొయిరి ప్రసాదరావు అన్నారు. మంగళవారం వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటలోని చిన్న వీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మమ్మ సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. వైద్యం అందుబాటులో లేని సమయంలో ఉద్దాన, తీర ప్రాంత గ్రామాల్లో ప్రసవ వేదనలో ఉన్న ఎంతో మంది గర్భిణులకు అండగా నిలిచి ప్రతికూల పరిస్థితుల్లో తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడారని కొనియాడారు. గ్రామపెద్దలు గాత ముకుందరావు, కె.కొర్లయ్య, కాంతారావు, దాలయ్య, సాధు పాల్గొన్నారు.

పాడి రైతులను ప్రోత్సహించాలి

● గవర్నర్ కంభంపాటి హరిబాబు


ఓంఫెడ్ అధికారులతో గవర్నర్ సమావేశం

భువనేశ్వర్: పాడి రైతులకు ప్రోత్సాహమివ్వాలని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి సూచించారు. మంగళవారం కటక్ అరిలో ప్రాంతం గోవింద్‌పూర్‌లోని ఓంఫెడ్ మెగా డైరీ ప్లాంట్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన అనుబంధ వర్గాలతో ఈ విషయమై లోతుగా చర్చించారు. పాడిరైతు సంక్షేమంతో ముడిపడిన పలు రైతాంగ పథకాలు అమలు చేయడంలో ఎటువంటి అడ్డంకి లేకుండా సత్వర చర్యలు చేపట్టేందుకు సదా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని గణనీయంగా పెంపొందించేందుకు ప్రభుత్వ పథకాల అమలు, కార్యాచరణతో రైతాంగానికి ప్రోత్సహించేందుకు బ్యాంకులు ముందడుగు వేయాలని కోరారు. ఇది పాల ఉత్పత్తి మరియు అవసరాల మధ్య అంతరాన్ని పూరించడంతో పెరుగుతున్న అవసరాలను తీర్చడంలో దోహదపడుతుందన్నారు. రైతులకు మద్దతు ఇచ్చే ముఖ్యమంత్రి కామధేను యోజన లబ్ధి పొందడంలో అనుబంధ రైతాంగం ఇబ్బంది పడకుండా పలు వెసులుబాటు సూచనలను గవర్నర్ తెలియజేశారు. ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై)కి అనుసంధానించి బ్యాంకు రుణాలు మంజూరుతో వ్యాపారాలను ప్రారంభించడం, విస్తరించడానికి రైతాంగానికి బలమైన ఆర్థిక వనరుగా ఆయా సంస్థలు చురుకైన పాత్ర పోషించాలన్నారు.

లబ్ధిదారుల జాబితాను అందించాలి
ముఖ్యమంత్రి కామధేను యోజన కింద లబ్ధిదారుల వివరణాత్మక జాబితాను బ్యాంకులకు అందించాలని గవర్నర్ ఓంఫెడ్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఏవైనా సమస్యలు తలెత్తితే ఓంఫెడ్ అధికారులు తనను నేరుగా సంప్రదించవచ్చని తెలియజేశారు. గవర్నర్ తన పర్యటనలో భాగంగా ఓంఫెడ్ ప్లాంట్‌లో ప్రయోగశాల, నెయ్యి విభాగం మరియు ఉత్పత్తుల గ్యాలరీతో సహా వివిధ విభాగాలను సందర్శించారు. ఓంఫెడ్ అధికారులు ప్లాంట్ కార్యకలాపాలు, నిర్వహణ, మార్కెటింగ్ వ్యూహాలు మరియు ఉత్పత్తి శ్రేణిపై వివరణాత్మక పవర్ పాయింట్‌ను సమర్పించారు. నగర ప్రాంతాల్లో ఓంఫెడ్ పాలు మరియు ఇతర ఉత్పత్తులను ఇంటి ముంగిటకు చేర్చే విధానాన్ని అమలు చేయాలని గవర్నర్ ప్రోత్సహించారు. మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్ కుమార్ వశిష్ట్, ఓంఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ అమృత్ కులంగే, కటక్ జిల్లా కలెక్టర్ దత్తాత్రయ భౌసాహెబ్ షిండే తదితరులు హాజరయ్యారు.


ఓంఫెడ్ పాల ఉత్పాదన గ్యాలరీ సందర్శిస్తున్న దృశ్యం


ప్లాంటులో పలు విభాగాల కార్యాచరణ వివరాలు తెలుసుకుంటున్న గవర్నర్


ఓంఫెడ్ ప్లాంటులోని పాల ఉత్పాదన విభాగం సందర్శనలో గవర్నర్ హరిబాబు



● ఉప్పొంగుతున్న వరద నీరు

భారీ వర్షంతో బొణై వంతెనపై 3 అడుగుల మట్టంతో వరద నీరు ప్రవహిస్తోంది. సారాసారా బాలంగో గ్రామ సమీపంలోని ఫటాంగ్ వంతెనపై వరద నీరు పొంగి పొర్లుతోంది. దీంతో 5 గ్రామాలకు రహదారులు విచ్ఛిన్నం అయ్యాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడి సాధారణ జన జీవనం ప్రభావితం అయింది. - భువనేశ్వర్

వ్యక్తిపై మారణాయుధాలతో దాడి


గాయాలు పాలై చికిత్స పొందుతున్న జేమ్స్


రాజాన జేమ్స్

రాయగడ: పాత కక్షలతో ఒక వ్యక్తిపై గుర్తు తెలియని దుండగులు మరణాయుధాలతో దాడి చేసిన ఘటన స్థానిక రెల్లివీధి కూడలి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఈ దాడిలో రెల్లివీధికి చెందిన రాజాన జేమ్స్ (53) అనే వ్యక్తి తీవ్రగాయాలకు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న బాధితుడి కుటుంబీకులు రక్తపు మడుగులో పడి ఉన్న జేమ్స్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు సదరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో డైలీ మార్కెట్ నుంచి బైకుపై ఇంటికి వస్తున్న సమయంలో రెల్లివీధి కూడలి వద్ద అప్పటికే కాపుకాసి ఉన్న ముగ్గురు దుండగులు అతని బైకు ఆపి తగాదా పడ్డారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పథకం ప్రకారం ముందుగానే తీసుకొచ్చిన పదునైన కత్తి, గొడ్డలితో దాడి చేశారు. దీంతో రెండు కాళ్లకు తీవ్రగాయాలవ్వడంతో పాటు కడుపులో కత్తితో పొడిచి దుండగులు పారిపోయారు. స్థానిక హాస్పిటల్‌లో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బాధితుడిని విజయనగరం తరలించినట్లు సమాచారం.

విరిగిపడిన కొండ చరియలు


విరిగిన కొండ చరియలు

కొరాపుట్: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడ్డాయి. మంగళవారం కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితి తెంతులి పాదర్ గ్రామ పంచాయతీ కుకడా సీల్ గ్రామ వద్ద రాళ్లు జారీ రోడ్డు మీదకి దొర్లుతూ వచ్చాయి. ఈ మార్గంలో తుల రంగ పానీ, ఉప్పర్ రంగ పానీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారత అల్యూమినియ కేంద్రం (నాల్కో) పరిధిలోని గనుల గ్రామాలు కావడంతో ప్రభావం చూపించింది.

ఏనుగుల గుంపు సంచారం


మొక్కజొన్న తోటలో సంచరిస్తున్న ఏనుగులు

కొరాపుట్: నవరంగ్‌పూర్‌లో జిల్లాలోకి అటవీ ఏనుగుల గుంపు ప్రవేశించింది. మంగళవారం ఉమ్మర్‌కోట్ సమితి కొహరా, కుర్సి గ్రామ పంచాయతీల్లోని మొక్కజొన్న పంటల్లో ఏనుగులు సంచరించడం గిరిజనులు గమనించారు. సమీప చత్తీస్‌ఘఢ్ రాష్ట్రం నుంచి ఇవి తరలి వచ్చాయి. వాటిలో నాలుగు ఏనుగులను గిరిజనులు గుర్తించారు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న పంట విస్తారంగా పండింది. దీంతో అటవీ శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎరువుల కోసం కదంతొక్కిన రైతులు


ఆందోళన చేపడుతున్న రైతులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ల్యాంప్ కార్యాలయం వద్ద ఎరువుల కోసం రైతులు కదం తొక్కారు. మోటు, పుసుగూడ కలిమెల గ్రామాలకు చెందిన 800 మంది రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కారు. ఒక లారీ ద్వారా 65 బస్తాల ఎరువులు వస్తే, వేలాడి మంది రైతులకు ఎలా సర్దుబాటు చేస్తారని మండిపడ్డారు.

రైతుల ఆందోళనతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మల్కన్‌గిరి కలిమెల, మోటు రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలను పంపిణీ చేస్తున్న అటవీ అధికారులు.


మొక్కలను నాటాలని ప్రచార రథం ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా అటవీశాఖ అధికారి కె.నాగరాజు అన్నారు. గుమ్మా బ్లాక్ జామి గ్రామంలో మొక్కలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజపతి జిల్లాలోని ఏడు సమితి కేంద్రాలు, 149 గ్రామ పంచాయతీల్లో ఈనెల 17న 'సింగిల్ డే మాస్ ప్లాంటేషన్ డ్రైవ్'ను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏక్ పేడ్ మా కే నామ్ 2.0ను జిల్లాలో ఏడు ఫారెస్టు రేంజ్ ఆధీనంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రత్యేక సమితిల్లో సర్పంచ్‌లు, బీడీవోలు, సమితి సభ్యులు పాల్గొంటారన్నారు.

మర్యాదపూర్వక భేటీ




కొరాపుట్: పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క భేటీ అయ్యారు. మంగళవారం బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఓటర్ రైట్ మార్చ్ ఆందోళనలో పాల్గొన్నారు. దీనిలో భాగంగా దేశంలో పార్టీ బలోపేతానికి చర్చించినట్లు ఆయన సప్తగిరి తెలియజేశారు.

రాహుల్ గాంధీతో మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి ఉల్క

భక్తిశ్రద్ధలతో పూజలు


పండిన కూరగాయలు, వరి ధాన్యాన్ని సమర్పించి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


నువాఖాయి పూజల్లో అమ్మవారు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం మజ్జిగౌరి అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన మంగళవారం రోజున నువాఖాయి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. ఆలయ పూజారి తరణి బెరుకో ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. పూజలు సందర్భంగా గంట సమయం వరకు భక్తుల దర్శనాలను నిలిపివేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి దర్శనాలు యథావిధిగా కొనసాగాయి. ప్రతీ ఏడాది నువాఖాయి సందర్భంగా అమ్మవారికి ఈ పూజలను నిర్వహిస్తామని పూజారి తెలిపారు. కొత్తగా పండించిన ధాన్యం పాయసం, అదేవిధంగా కొత్తగా పండిన కూరగాయలను అమ్మవారి చెంత ఉంచి పూజలను నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వాదంతో పంటలు సంమృద్ధిగా పండాలని, అదేవిధంగా అంతా సుభిక్షంగా ఉండాలని ఈ పూజలను నిర్వహిస్తారని ప్రతీతి.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన


పద్మాగిరి పాఠశాలలో వంటలు పరిశీలిస్తున్న కలెక్టర్ సోమేష్ తదితరులు

మల్కన్‌గిరి: జిల్లా కలెక్టర్ సోమేష్ ఉపాధ్యాయ్ వినూత్నంగా ఒక కొత్త విధానాన్ని అవలంభించారు. దీనిలో భాగంగా అకస్మాత్తుగా పద్మాగిరి పంచాయతీలోని ఎస్ఎస్‌డీ హైస్కూల్‌కి వెళ్లి మధ్యాహ్న భోజనం నాణ్యతను మంగళవారం పరిశీలించారు. అలాగే ఖిరపల్లి తోళసాహి ప్రైమరీ పాఠశాలలోనూ తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు సబ్ కలెక్టర్ అశ్విని తదితరులు ఉన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా, నియోజకవర్గాల, మండల కమిటీలు ఏర్పాటు చేసి గ్రామగ్రామాన ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జెండా ఎగిరేలా కృషి చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 130 బీసీ కులాల అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బీసీ విద్యార్థుల వసతి గృహాల సమస్యల నుంచి జాతీయస్థాయిలో జనగణన, కుల గణన చేసేవరకు అనేక సమరశీల పోరాటాలు చేసి విజయాలు సాధించగలిగామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పైడి చందు బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. సమావేశంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి, జిల్లా నాయకులు రత్నాల మురళీ మోహన్‌రావు, బగాది రమణమూర్తి, రాయల రాము, రాజమహంతి భానుచందర్, గానుగుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


ఎరువుల దుకాణం వద్ద విజిలెన్స్ బృందం

గార : రామచంద్రాపురం పరిధిలోని నవజ్యోతి, దుర్గా ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. దుర్గా షాపు లైసెన్సు రెన్యువల్ ఇంకా జరగకపోవడాన్ని గుర్తించారు. నిల్వ ఉన్న 5.50 మెట్రిక్ టన్నుల డీఏపీ, ఎంవోపీ, సాయిల్ కండీషనర్ ఎరువుల అమ్మకాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా విజిలెన్సు సీఐ డి.వి.వి.సతీష్‌కుమార్, వ్యవసాయాధికారి డి.పద్మావతిలు మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు అమ్మినా, అదనపు ఎరువులతో లింక్‌పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆటోడ్రైవర్లకు బాసటగా..



ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో మంగళవారం ఆమదాలవలసలో భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా కాసేపు ఆటో నడిపారు. స్త్రీ శక్తి పథకం నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. - ఆమదాలవలస

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి


చదురుగుడిలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


అదుపుతప్పి బోల్తా పడిన లారీ

బొండపల్లి: మండలం కేంద్రంలో జాతీయ రహదారి 26పై మంగళవారం మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ ఐరన్ ఓర్ లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వెళుతూ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి పెద్దప్రమాదం జరగక పోవడంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

వట్టిగెడ్డలో గల్లంతైన రైతు మృతి

సాలూరు రూరల్: మండలంలోని దుద్ది సాగరం గ్రామానికి చెందిన మంచాల రామయ్య (45) వట్టిగెడ్డలో సోమవారం సాయంత్రం గల్లంతైన విషయం తెలిసిందే. అయితే మంగళవారం రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గెడ్డలో గాలించగా గ్రామ సమీపంలోని తుప్పల్లో మృతదేహం దొరికిందని రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

గెడ్డలో పడి వ్యక్తి మృతి


రమేష్ మృతదేహం

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని కొండవీధికి చెందిన కారంగి రమేష్(42) గెడ్డలో పడి మృతిచెందాడు. మండలంలోని గోపాలపురం గ్రామ సమీపంలోని గెడ్డలో చేపల వేటకు వెళ్లిన రమేష్ ప్రమాదవశాత్తు కాలు జారి నీటిప్రవాహంలో కొట్టుకుపోయాడు. సోమవారం రాత్రి సమయంలో ప్రమాదం జరగడంతో గమనించిన సహచరులు బయటకు తీసి మరణించినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ప్రయోగమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

లాటరీ విధానంలో బార్ కేటాయింపు

పార్వతీపురం రూరల్: లాటరీ విధానంలో సాలూరులోని ఒక బార్‌ను కేటాయించారు. నాలుగు దరఖాస్తులు రావడంతో బార్ కేటాయింపునకు కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో మంగళవారం లాటరీ తీశారు. బార్‌ను సాలూరుకు చెందిన రుంకాన నరేష్ దక్కించుకున్నట్టు ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు తెలిపారు.

సమాచార శాఖ ఎ.డిగా గోవిందరాజులు


పి.గోవిందరాజులు, డీపీఆర్‌ఓ

విజయనగరం అర్బన్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకుడిగా పి.గోవిందరాజులు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా డీపీఆర్ ఓగా, డివిజనల్ పీఆర్‌ఓగా, ఇన్‌చార్జ్ డీపీఆర్ ఓగా కూడా పనిచేస్తున్నారు. తాజాగా ఇక్కడికి పదోన్నతిపై రానున్నారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

అర్జీదారుల సమస్యలు అర్థం చేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్
- పీజీఆర్ఎస్ నోడల్ అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: తమ సమస్యలు, బాధలు తీరుతాయనే అర్జీదారులు పీజీఆర్ఎస్‌కు వస్తారని, వాటిని అర్థం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించడమే నిజమైన సేవ అని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. అర్జీదారుల పట్ల సానుకూలంగా వ్యవహారం ఉండాలని దరఖాస్తులో వాస్తవికత ఉంటే పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారులతో అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా అర్జీల పరిష్కారం ద్వారా ఒకరి సమస్య తీర్చడమే నిజమైన సేవగా భావించాలని హితవు పలికారు. అర్జీలకు సమాధానాలు రాసేటప్పుడు స్పీకింగ్ ఆర్డర్ మాదిరి ఉండాలని ఏది అడిగారో దానికోసమే సమాధానం రాయాలని అయితే సమాధానం రాసిన తర్వాత అర్జీదారు సంతృప్తి చెందేలా ఉండాలని ఎట్టి పరిస్థితిల్లోనూ రీ ఓపెన్ కాకూడదని తెలిపారు.

బాధ్యత గల ఉద్యోగిని కలెక్టరేట్‌కు పంపాలి

అర్జీలను ఎలా పరిష్కరించాలో జిల్లా అధికారులు వారి స్టాఫ్‌కు ప్రతి సమావేశంలోనూ అవగాహన కలిగించాలన్నారు. అర్జీల పరిష్కారానికి ప్రతి కార్యాలయం నుంచి ఒక బాధ్యత గల ఉద్యోగిని డిజిగ్నేట్ చేసి వారిపేరును కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు. ఆర్జీల కోసం ప్రతి రోజు లాగిన్‌లో చూడాలని అలాగే సాయంత్రం వెళ్లేటప్పుడు కూడా చూడాలని తెలిపారు. ఏ టైమ్‌లో నైనా చూడకుండా ఉన్న అర్జీలు సున్నా కనపడాలని స్పష్టం చేశారు. అర్జీ అందగానే అర్జీదారుతో ముందు మాట్లాడాలని తన సమస్య ఏంటో తెలుసుకుని సమాధానం రాయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పీజీఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా ఉంటే ఆ అధికారి సీఆర్‌లో నెగటివ్‌గా రాయనున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ మురళి, జిల్లా అధికారులు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల నిరీక్షణ

- ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు
- ఇంకా అమలు కాని హామీ
- ఆశగా ఎదురు చూస్తున్న యువత


నిరుద్యోగ భృతి కోసం ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

రామభద్రపురం: ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ప్రతి ఇంటికో ఉద్యోగం, లేదా నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో బాగంగా సూపర్ సిక్స్‌లో పథకాల్లో నిరుద్యోగ భృతిని మొదటి హామీగా పేర్కొన్నారు. రోజులు గడుస్తున్నా..ఈ హామీ ఇంకా అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి ఇంట్లో నిరుద్యోగులు చంద్రబాబు ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారా? అసలు చేస్తారా? చేయరా? చేస్తే ఎప్పటి నుంచి అమలు చేస్తారు? ఇంటికో ఉద్యోగం ఇస్తారా? ఒకవేళ నిరుద్యోగ భృతి ఎంత ఇస్తారు? వంటి సందేహాలతో యువత సతమతమవుతున్నారు.అసలు ఎప్పుడు వస్తుందోనని ఆశతో ఎదురు చూస్తున్నారు.

సందిగ్ధంలో నిరుద్యోగులు..

2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ అప్పుడు కూడా ఎన్నికల ప్రచారంలో జాబు కావాలంటే..బాబు రావాలి,ఇంటికో ఉద్యోగం లేదంటే ప్రతి నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలిచ్చింది. కానీ ఎక్కడా ఆ హామీ కార్యరూపం దాల్చలేదు.ఇంటికో ఉద్యోగం మాట దేవుడెరుగు కనీసం నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మొండిచేయి చూపారు. గత అనుభవంతో ఈ సారైనా హామీ అమలు చేస్తారా? లేదా మొండి చెయ్యి చూపిస్తారా? అనే సందిగ్ధంలో నిరుద్యోగులు ఉన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుతో సుమారు 5 లక్షల మంది నిరుద్యోగులకు కార్యదర్శులు, వలంటీర్లుగా నియమించిన విషయం తెలిసిందే. మరి చంద్రబాబు ప్రభుత్వం ఏమేరకు ఉద్యోగాలు కల్పిస్తుందోనని యువత ఆశగా ఎదురు చూస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో వేలాది మంది ఉన్నత చదువులు అభ్యసించారు. నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు.కూటమి ప్రభుత్వం నేటికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ప్రభుత్వ పాలనపై గుర్రుగా జనసైనికులు

- రాష్ట్రంలో పార్వతీపురంలోనే ఎక్కువ అవినీతి
- బడిదేవర కొండపై స్థానిక ఎమ్మెల్యే తీరు విడ్డూరం
- విలేకరుల సమావేశంలో ఎండగట్టిన జనసేన ఇన్‌చార్జ్ ఆదాడ


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు ఆదాడ మోహనరావు

పార్వతీపురం రూరల్: ఎన్నికల సమయంలో తామంతా ఒక్కటే. తమ ఎజెండా ఒక్కటే అంటూ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చి తీరా ఏడాదిన్నర గడవక ముందే జనసేన నాయకులు బహిరంగంగా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి మరీ స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, జిల్లాస్థాయి అధికారుల తీరుపై ప్రజల తరపున జనసేన ప్రశ్నిస్తుందంటూ ఎండగడుతున్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ ఆదాడ మోహనరావు ఆ పార్టీ అధినేత జన్మదినాన్ని పురస్కరించుకుని కొన్ని కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ స్థానిక నియోజకవర్గ పాలకుల తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే పార్వతీపురంలో అత్యంత అవినీతి పాలన సాగుతోందని నివేదికలు చెబుతున్నాయన్నారు. ఆరు నెలల క్రితం బడిదేవరకొండ అనుమతులు రద్దుచేయాలని తాము పోరాటం చేస్తే ఆరు నెలల తరువాత స్థానిక ఎమ్మెల్యేకు బడిదేవరకొండ సమస్య గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. కంపెనీ యాజమాన్యంతో ఇంతవరకు సఖ్యంగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే విజయచంద్రకు ఇప్పుడు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తుకు రావడం మరింత ఆశ్చర్యకరమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

పార్వతీపురంలో చెరువులు అక్రమాలకు గురైతే ఎన్నోమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పత్రికా ముఖంగా నిలదీశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారన్నారు. జిల్లా కేంద్రంలో మున్సిపాల్టీ ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయలేని దుస్థితిలో జిల్లా యంత్రాంగం, పాలకులు ఉన్నారన్నారు. ఏడాదిన్నరలో మంజూరైన నిధులు ఏం చేశారో తెలియడం లేదని ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఇకమీదట పార్టీ అధినేత ఆదేశాలకోసం ఎదురు చూడమని, ఇకనుంచి దోపిడీ పాలనపై ప్రశ్నిస్తామని మోహనరావు స్పష్టం చేశారు.

గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం

- ఎస్‌హెచ్‌ఓలతో ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్


ఎస్‌హెచ్‌ఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌తో ఎస్పీ మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలను జారీ చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం నమోదై, దర్యాప్తులో ఉన్న గంజాయి కేసులపై ఎస్పీ వకుల్ జిందల్ సమీక్ష చేశారు. దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకుని కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని పరారీలో ఉన్న నిందితుల గురించి సమాచారం సేకరించాలని, వారి ఆచూకీని గుర్తించేందుకు సాంకేతికతను వినియోగించాలని సూచించారు. అవసరమైతే ఆయా కేసుల్లో ప్రైసిడెన్సీ పాస్‌పోర్టు తీసుకుని, ఇతర రాష్ట్రాలకు పోలీసు బృందాలను పంపాలని అధికారులను ఆదేశించారు. తరచూ ఇదే తరహా నేరాల్లో అరెస్టు అవుతున్న నిందితులపై హిస్టరీ షీట్లు ప్రారంభించి, వారి కదలికలపై నిఘా పెట్టాలని చెప్పారు. నిందితులు ఇతర ప్రాంతాలకు చెందిన వారైతే వారి హిస్టరీ షీట్లను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేయాలన్నారు. ఎన్డీపీఎస్‌కు అనుకూలంగా ఉన్న కేసుల్లో అనుమతులు పొంది నిందితులను ముందస్తుగా అరెస్టు చేయాలన్నారు.

నిందితుల ఆస్తులు అటాచ్ చేయాలి

గంజాయి వ్యాపారంతో అక్రమంగా సంపాదించిన వారి ఆస్తులను గుర్తించి, ఫైనాన్షియల్ ఇన్విస్టిగేషన్ పూర్తి చేసి, వారి అక్రమ ఆస్తులను అటాచ్ చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. గంజాయితో పట్టుబడిన కేసుల్లో గంజాయి రవాణాకు పాల్పడిన వ్యక్తులతోపాటు, వారికి గంజాయిని సరఫరా చేసిన వ్యక్తులు, విక్రయించిన వ్యక్తులను, ఇతర ప్రధాన నిందితులను కూడా ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చాలని తెలిపారు. నాన్ బెయిలబుల్ వారంట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని ఎగ్జిక్యూట్ చేసేందుకు సిబ్బందిని నియమించాలని చెప్పారు. రాబోయే లోక్ అదాలత్‌లలో ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పెండింగులో ఉన్న గంజాయి కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి, నిందితులపై అభియోగ పత్రాలను దాఖలు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.ఈ జూమ్ కాన్ఫరెన్సులో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్య రెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు


రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు దక్కించుకున్నారు. గత నెల 30,31 తేదీల్లో ప.గో జిల్లా భీమవరంలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పారు. అంతర్ జిల్లాల పోటీల్లో కె.హిమశ్రీ, పి.తేజస్విని, టి. యమున సిల్వర్ మెడల్స్ సాధించగా..వి.కేసరి డి.ధరహాసిని, టి.భానుమతి బ్రాంజ్ మెడల్స్ దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను కోచ్ డీవీ చారిప్రసాద్, ఫెన్సింగ్ అసోసియేషన్ సభ్యులు దాలిరాజు, పిల్లా శ్రీనివాస్, వెంకటేష్, సతీష్‌కుమార్‌లు అభినందించారు.

సర్వేయర్ ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అమ్మన్నరావు


బలరాం(ఫైల్)

సీతంపేట: మండలంలోని కొత్తగూడ పంచాయతీ వంబరెల్లి నాయుడుగూడ గ్రామానికి చెందిన సర్వేయర్ సవర బలరాం (31) ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీడిచెట్టుకు ఉరివేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు, గ్రామస్తులు తెలిపారు. గొయిది గ్రామ సర్వేయర్‌గా పనిచేస్తున్న ఆయనకు జూలైలో భామిని మండలం బత్తిలి వన్ గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యింది. ఇటీవల ఆర్థికపరమైన సమస్యలు రావడంతో మనస్తాపానికి గురై ఇంటిపక్కనే ఉన్న జీడితోటలోకి వెళ్లి ఉరివేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు అనీష, చారుమతి ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో గుండెలవిసేలా కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. బలరాం బలవన్మరణానికి పాల్పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై వై.అమ్మన్నరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సేవలు శ్లాఘనీయం


రిటైర్ అయిన హోం గార్డ్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్:

జిల్లా పోలీసు శాఖలో హోంగార్డులుగా సుదీర్ఘ కాలం సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన వారికి ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం 'ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ హోంగార్డుల సేవలను కొనియాడి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా, క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన హోం గార్డులు కె.సూర్యనారాయణ, ఎం.వెంకట రామ కృష్ణారావులను పోలీసుశాఖ తరపున ఎస్పీ వకుల్ జిందల్ మనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ తరువాత ఇకపై ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులకు ఎస్పీ సూచించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన గార్డుల దంపతులను జిల్లా పోలీసుశాఖ తరపున ప్రత్యేకంగా అభినందించి, శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఆర్.రమేష్ కుమార్, ఇనార్జ్ హెచ్సీ రాజు, హోంగార్డ్స్, వారి కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వింతవ్యాధితో లక్షకు పైగా కోళ్లు మృతి

- నమూనాలు విజయవాడ ల్యాబ్‌కు తరలింపు


కొత్తవలస: వింత వ్యాధులతో దేశవాళీ, ఫారం కోళ్లు మృత్యువాత పడుతున్నాయని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు కన్నంనాయుడు మంగళవారం తెలిపారు. కొత్తవలస పశు సంవర్ధక శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని కొత్తవలస, లక్కవరపుకోట మండలాల పరిధిలో నేటి వరకు లక్ష వరకు కోళ్ల మృతి చెందినట్టు వెల్లడించారు. రెండు మండలాల్లో 80కి పైగా కోళ్ల ఫామ్‌లు ఉన్నాయని, గత నెల రోజుల నుంచి వరుసగా కోళ్లు చనిపోవడం ప్రారంభమైందన్నారు. కోళ్లఫామ్‌ల యజమానులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారని, కోళ్లకు సోకిన వ్యాధి నిర్ధారణకు నమూనాలను విజయవాడ ప్రత్యేక ల్యాబ్‌కు పంపించామన్నారు. చనిపోయిన కోళ్లను ఆరుబయట వేయకుండా గొయ్యితీసి పాతిపెట్టాలని సూచించారు. ల్యాబ్ ఫలితాలు వస్తేగాని వ్యాధి నిర్ధారణ చేయలేమన్నారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట:

ఎస్.కోట పట్టణ పోలీసులు మంగళవారం బొడ్డవర కూడలిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు లగేజీ బ్యాగ్‌లతో పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 7 ప్యాకెట్లలో 10కిలోల గంజాయి లభించింది. నిందితులు బెంగళూరు సమీపంలోని తిరుమలశెట్టి గ్రామానికి చెందిన చరనా దారి, పవన్ మంజూనాథ్‌లుగా గుర్తించారు. వీరు అరకు నుంచి కర్నాటక రాష్ట్రానికి గంజాయి రవాణా చేస్తుండగా పట్టుపడ్డారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గౌరునాయుడు మృతదేహం

గంట్యాడ: మండలంలోని గింజేరు గ్రామానికి చెందిన చప్ప గౌరునాయుడు (32) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తామరాపల్లి నుంచి కాలినడకన గింజేరు జాతీయ రహదారిపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

- జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

డెంకాడ: బాల్య వివాహాలు చేయడం నేరమని, చేసిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తారని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. ఈ మేరకు డెంకాడ మండలంలోని పెదతాడివాడ గ్రామంలో యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సమాజం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా బాల్య వివాహాల కేసులు నమోదు కావడం దురదృష్టకరమన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి, చేయించిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. న్యాయ సహాయం కోసం పేదలు జిల్లా న్యాయ న్యాయసేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. బాలలు పాఠశాలలో ఉండాలని, వారిని పనిలో ఉంచితే బాలకార్మిక చట్టాల ప్రకారం నేరమన్నారు. వీటిపై కూడా కేసులు నమోదు చేస్తారని చెప్పారు. పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమాల్లో బెజ్జిపురం యూత్‌క్లబ్ కోఆర్డినేటర్ ఝాన్సీ, సచివాలయ కార్యదర్శి అప్పలనాయుడు, వివిధ విభాగాల అధికారులు, గ్రామపెద్దలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల స్థాయి జిల్లాలో పెరగాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో భూగర్భ జలాల స్థాయిని పెంచే మార్గాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో భూగర్భ జలాల స్థాయిలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకు దోహద పడే ఉపాధి హామీ పథకం ద్వారా చెక్ డ్యాంలను, ఫారం పాండ్స్‌ను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. అందుకు అవసరమయ్యే మంజూరులను తీసుకుని ప్రతిపాదనలను పంపాలని చెప్పారు. జిల్లాలో 3 మీటర్ల లోపల 17 మండలాల్లో, 3 నుంచి 8 మీటర్ల లోపు 9 మండలాల్లో, 8 మీటర్ల లోతులో 2 మండలాల్లో భూగర్భజలాల స్థాయి ఉందన్నారు. అయితే జిల్లా సరాసరి 3.80 మీటర్లలోపు ఉంటుందన్నారు. రాష్ట్రంలో బాపట్ల సరాసరి 3.7 మీటర్ల లోతులో ఉంటూ మొదటి స్థానంలో ఉందని, విజయనగరం 2వ స్థానంలో ఉందన్నారు. జిల్లాలో 215 గ్రామాల్లో భూగర్భ నీటి స్థాయి తక్కువగా ఉన్నట్లు గుర్తించామని ఈ గ్రామాల్లో భూగర్భ నీటిస్థాయిని పెంచడానికి వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. జలవనరుల శాఖ ద్వారా మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లను క్లీనింగ్ చేయాలని వచ్చే 4 రోజుల్లో 174 చెరువులను పరిశుభ్రం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, ఇరిగేషన్ ఈఈ రమణ, గ్రౌండ్ వాటర్ డీడీ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిందాల్ సమస్యలపై గ్రామసభ

జిందాల్ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎస్.కోట మండలం మూల బొడ్డవర గ్రామంలో బుధవారం కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వద్ద నున్న డాక్యుమెంట్ల ఆధారాలతో గ్రామ సభకు హాజరు కావాలని సూచించారు. న్యాయపరంగా రికార్డు పరంగా కచ్చితంగా ఉన్న వారికి అక్కడికక్కడే పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. లేని వారికి కారణాలను తెలియజేయనున్నామని పేర్కొన్నారు. ఈ గ్రామ సభకు తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు రికార్డులతో హాజరవుతారని అదేవిధంగా జిందాల్ కంపెనీ వారు కూడా రికార్డులతో హాజరవుతారని కలెక్టర్ తెలిపారు.

చంపావతిలో ఇసుక అక్రమ తవ్వకాలు


మొయిద కాజ్‌వే వద్ద ట్రాక్టర్లతో ఇసుక తరలింపు ఇలా

నెల్లిమర్ల: చంపావతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం, మొయిద గ్రామాలకు వెళ్లే రహదారుల్లో చంపావతినదిపై ఉన్న వంతెనలు, తాగునీటి పథకాల సమీపంలో ఇసుక తవ్వకాలు సాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇసుక అక్రమ తవ్వకాలు ఇలాగే కొనసాగితే వంతెనలు, తాగునీటి పథకాలకు ముప్పుతప్పదని ఈ ప్రాంతీయులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక అక్రమతవ్వకాలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

నివాసాలుగా ప్రభుత్వ భవనాలు


నివాసంగా మారిన గంగుబూడి వెల్‌నెస్ కేంద్రం




రైతుభరోసా కేంద్రంలో నివసిస్తున్న ఓ కుటుంబం

ఈ చిత్రాలు చూశారా... లక్కవరపుకోట మండలం గంగుబూడి గ్రామ సచివాలయం పరిధిలో లక్షలాది రూపాయల ఖర్చుతో గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, రైతుభరోసా కేంద్రాలివి. భవనాలు ప్రారంభించే సమయానికి ప్రభుత్వం మారడంతో ఇవి అందుబాటులోకి రాలేదు. దీనినే అనువుగా చేసుకుని ఓ రెండు కుటుంబాలు ఏకంగా భవనాల్లో కాపురం పెట్టేశాయి. ప్రభుత్వ భవనాలను సొంతిల్లుగా వాడుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు ఈ భవనాలే నిలువెత్తు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. స్థానికులకు వైద్యసేవలు, రైతులకు సాగు సేవలందించేందుకు నిర్మించిన భవనాలను వినియోగంలోకి తేవడంలో కూటమి ప్రభుత్వం అలక్ష్యం చేస్తోందని, సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యానికి తూట్లు పొడుస్తోందంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తేవాలని, ఉద్యోగుల విధులకు కేటాయించాలని కోరుతున్నారు.

– లక్కవరపుకోట